E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 11-05-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



మే 27నే కేరళకు నైరుతి రుతుపవనాలు » 3లో

## అట్టహాసంగా మిస్ వరల్డ్ 2025 పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభమైనట్టు ప్రకటించిన సీఎం

అట్టహాసంగా ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ వేడుకలు

తమను తాము పరిచయం చేసుకున్న 109 దేశాల కంటెస్టెంట్లు

పాశ్చాత్య సంగీతం.. తెలంగాణ సంప్రదాయ కళా బృందాల విన్యాసం


గోకులంలో గోపిక వస్త్రధారణతో అలరించిన మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా

శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మిస్ వరల్డ్ పోటీల ప్రారంభ వేడుకల్లో త్రివర్ణపతాకంతో మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా. చిత్రంలో వివిధ దేశాల సుందరీమణులు

ఈ కబురు, హైదరాబాద్: శనివారం సాయంత్రం.. భాగ్యనగరం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం.. అందం.. ఆత్మవిశ్వాసం.. అభినయం.. కలిసి కవాతు చేశాయి..ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ వేడుకలను సప్తవర్ణ శోభితం చేశాయి. మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీలు హైదరాబాద్ కేంద్రంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రపంచం నలుమూలల నుంచి 109 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చిన పోటీదారులైన అందగత్తెలు లయబద్ధమైన పాశ్చాత్య సంగీత హోరుకు తగ్గట్టుగా అభినయిస్తూ తమను తాము పరిచయం చేసుకోగా, ఆయా సుందరీమణుల బృందాన్ని తెలంగాణ సంప్రదాయ కళాకారుల బృందం నర్తిస్తూ వేదిక మీదకు స్వాగతించింది. ఒకవైపు పాశ్చాత్య సంగీతం.. మరోవైపు తెలంగాణ సంప్రదాయ కళా బృందాల విన్యాసం.. వెరసి ఓ జుగల్‌బందీగా ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశాయి. దాదాపు రెండున్నర గంటల పాటు కొనసాగిన ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ కార్యక్రమం ప్రేక్షకులను ఆసాంతం అలరించింది. జయ జయహే తెలంగాణ ఆలాపనతో.. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో పరిమిత సంఖ్యలో హాజరైన ప్రేక్షకుల మధ్య ప్రపంచ సుందరి పోటీల పరిచయ కార్యక్రమం కొనసాగింది. సాయంత్రం ఆరున్నరకు తెలంగాణ గీతం జయ జయహే తెలంగాణ ఆలాపనతో కార్యక్రమం మొదలైంది.

తరువాయి 2లో

## కాల్పుల విరమణ.. పాక్ ఉల్లంఘన



పాకిస్తాన్ రెండు నాల్కల ధోరణి
కాల్పుల విరమణకు ఒప్పందం
కోరి మరీ కుదుర్చుకున్న దాయాది
డీజీఎంఓ స్థాయి చర్చల్లో అంగీకారం
సాయంత్రం ఐదింటి నుంచే అమల్లోకి
కాసేపటికే మళ్లీ దాడులకు దిగిన పాక్
క్షిపణులు, డ్రోన్లు, సరిహద్దుల్లో కాల్పులు
దుర్మార్గ వైఖరిపై మండిపడ్డ భారత్
అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాం
తక్షణం ఒప్పందానికి కట్టుబడండి
విదేశాంగ కార్యదర్శి మిస్రీ హెచ్చరిక
ఒప్పందం కుదిర్చింది అమెరికానే
అంతకుముందు ట్రంప్ అనూహ్య ప్రకటన
ద్వైపాక్షిక ఒప్పందమేనన్న కేంద్రం

ఈ కబురు:న్యూఢిల్లీ/వాషింగ్టన్/ఇస్లామాబాద్ కయ్యానికి కాలుదువ్విన దాయాదికి నాలుగు రోజుల్లోనే తత్వం బోధపడింది. సాయుధ ఘర్షణకు తెర దించుదామంటూ భారత్‌తో కాళ్లబేరానికి వచ్చింది. దాంతో ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు ప్రభుత్వాలూ దాన్ని ధ్రువీకరించాయి. తమ మధ్యవర్తిత్వమే ఇందుకు కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా భారత్ దాన్ని తోసిపుచ్చింది. పాక్ విజ్ఞప్తి మేరకే ద్వైపాక్షిక చర్చల ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రకటించింది. ''శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్ర తలాల్లో పూర్తిస్థాయిలో కొనసాగుతుంది'' అని విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ మీడియాకు వెల్లడించారు. కానీ కాసేపటికే పాక్ వంకర బుద్ధి ప్రదర్శించింది. శనివారం రాత్రి ఏడింటి నుంచీ మరోసారి దాడులకు దిగింది. సరిహద్దుల గుండా మళ్లీ డ్రోన్ ప్రయోగాలకు, కాల్పులకు తెగబడింది.

తరువాయి 2లో

## భారత్,పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం.

### సరిహద్దుల్లో శాంతి శంఖారావం

*శాంతి ఎప్పుడూ యుద్ధం కన్నా గొప్పదే...కానీ కొన్నిసార్లు శాంతి సాధించడానికి కూడా ధైర్యం, సంకల్పం కావాలి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం, భారత్, పాక్ మధ్య తారస్థాయికి చేరిన పరిస్థితులకు తాత్కాలికంగా ముగింపు లభించింది.*

*ఈ కబురు;శనివారం సాయంత్రం భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. భారత సైన్యం సమాధానం కారణంగా పాకిస్తాన్ ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. చివరకు అమెరికాను రాయబారం కోసం వేడుకోగా, ట్రంప్ చర్చలతో భారతదేశం కాల్పుల విరమణకు అంగీకరించింది.*




తరువాయి 2లో

డొనాల్డ్ ట్రంప్ ట్వీట్: సోషల్ మీడియాలో ఇదే హాట్ టాపిక్ » 4లో



ఇండియాలోనే టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్..? ఆందోళనలో ఐసీసీ » 6లో




అప్పుడు నేనెంతో బాధపడ్డా.. ఫెయిల్యూర్‌ని అనుకున్నా: సమంత » 5లో



తగ్గినట్టే తగ్గి.. తులం బంగారం ఇప్పుడు.. » 4లో



## యుద్ధప్రాతిపదికన సీతారామ ఎత్తిపోతల పథకం పనులు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు సీతమ్మ సాగర్ ఆనకట్టను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఈ కబురు,హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు సీతమ్మ సాగర్ ఆనకట్టను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పనుల పురోగతికి సంబంధించిన అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి హైదరాబాద్ జలసౌధలో ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఇల్లందుకు సాగునీరు అందించే విషయమై గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను కూడా సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. అనుమతులు, పనుల పురోగతి, భూసేకరణ, సంబంధిత అంశాలపై ఇంజినీర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. » 2లో

## పాక్ దాడులు.. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం



పాక్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన పౌరుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు.

ఈ కబురు: గత రెండు రోజుల నుంచి జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలపై పాక్ జరుపుతున్న దాడుల్లో దాదాపు 20మంది పౌరులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

పహల్గాం దాడికి ప్రతీకారంగా ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో.. పాక్ కూడా సరిహద్దు ప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడుతోంది. కశ్మీర్‌లోని శ్రీనగర్, రాజౌరి, పూంఛ్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో పాక్ డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో జమ్మూకశ్మీర్ ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థప్పా సహా దాదాపు 20మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా..పదుల సంఖ్యలో గాయపడ్డారు. పౌరులు, ప్రభుత్వ ఉన్నతాధికారి మృతి పట్ల జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరోజు ముందే తాను అధ్యక్షత వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని.. ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు.

తరువాయి 3లో


## పాక్‌లో ఇంధన కొరత.. 48 గంటల పాటు పెట్రోల్ బంక్‌లు మూసివేత



తరువాయి 3లో

## ప్రధాని నివాసంలో మరోసారి సమావేశం

ఈ కబురు: భారత్ - పాక్ దేశాల మధ్య కాల్పుల విరమణ జరగ్గా.. ప్రధాని నరేంద్రమోడీ నివాసంలో మరోసారి త్రివిధ దళాధిపతులు సమావేశమయ్యారు. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, అజిత్ దోవల్, సెంటర్ డిఫెన్స్ స్టాఫ్ డైరెక్టర్ అనిల్ చౌహాన్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ జరగడంతో. » 2లో



## కాల్పుల విరమణకు అంగీకరించినా.. నిరంతరం సన్నద్ధతతోనే సైన్యం!

ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్ అంగీకరించాయి. దీనిపై భారత సైన్యం స్పందించింది.



» 2లో

## కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించడం అత్యంత దుర్మార్గం: విక్రమ్ మిస్రీ



సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు

ఈ కబురు,దిల్లీ: సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. శనివారం రాత్రి దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణ అవగాహనను పాక్ ఉల్లంఘించడం సరికాదన్నారు. డీజీఎంవో మధ్య జరిగిన అవగాహనను ఉల్లంఘించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. కొన్ని గంటలుగా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, ఇది అత్యంత దుర్మార్గమని ఘాటుగా స్పందించారు. » 3లో

ఆపరేషన్ సిందూర్‌లో హతమైన టాప్ టెర్రరిస్ట్‌లు వీళ్లే.. వివరాలు వెల్లడి..!



» 3లో

మొదటి పేజీ తరువాయి

# అట్టహాసంగా మిస్ వరల్డ్ 2025 పోటీలు ప్రారంభం





జయ జయహే తెలంగాణ ఆలాపనతో..

గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో పరిమిత సంఖ్యలో హాజరైన ప్రేక్షకుల మధ్య ప్రపంచ సుందరి పోటీల పరిచయ కార్యక్రమం కొనసాగింది. సాయంత్రం ఆరున్నరకు తెలంగాణ గీతం జయ జయహే తెలంగాణ ఆలాపనతో కార్యక్రమం మొదలైంది. గాయకుడు సంగీత శిక్షకుడు రామాచారి శిష్యులు 50 మంది ఈ గీతాన్ని అద్భుతంగా ఆలపించి ఆకట్టుకున్నారు. ఆ వెంటనే రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాలకు చెందిన సంగీత శిక్షణ కేంద్రాల కళాకారిణులు 250 మంది పేరిణి నృత్య రూపాన్ని ప్రదర్శించారు. హంస నడకలతో అందమే సాగెనే... అరవిరిసిన..' అంటూ ప్రపంచ సుందరి పోటీలకు సరిపోయే గీతాన్ని ఎంచుకున్న తీరు ఆకట్టుకుంది. దానికి తగ్గట్టుగా కళాకారిణులు నర్తించి పరవశింపజేశారు. అంత పెద్ద సంఖ్యలో కళాకారిణులు స్టేడియం మొత్తం కలిగి తిరుగుతూ నర్తించటం, మధ్యలో సీతా కోకచిలుక, నక్షత్రం, మిస్ వరల్డ్ లోగో ఆకృతిని ఆవిష్కరించడం అబ్బురపరిచింది. దాదాపు 10 నిమిషాల పాటు సాగిన ఈ నృత్య కార్యక్రమానికి పేరిణి సందీప్ నృత్య దర్శకత్వం వహించగా, ఫణి నారాయణ స్వరాలు సమకూర్చారు.

### ఖండాల వారీగా నాలుగు బృందాలుగా..

ప్రారంభ వేడుకల్లో 109 దేశాల సుందరీమణులు పాల్గొన్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. వీరిని ఖండాల వారీగా నాలుగు బృందాలుగా విభజించారు. తొలుత తెలంగాణకు చెందిన ఒక్కో సంప్రదాయ కళా బృందం ప్రదర్శన ఇవ్వగా, ఆ వెంటనే ఒక్కో బృందం చొప్పున సుందరీమణులు స్టేడియంలోకి వచ్చి పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా రామకృష్ణ ఆధ్వర్యంలో కొమ్ము కోయ బృందం కోయ డప్పు నృత్యం ప్రదర్శించారు. ఆ వెంటనే అమెరికా-కరేబియన్ దేశాలకు చెందిన తొలి సుందరీమణుల బృందం వచ్చింది. నిర్వాహకులు దేశాల వారీగా పిలవగానే ఆయా దేశాల ప్రతినిధులు ఒక్కొక్కరు పాశ్చాత్య బీట్‌కు తగ్గట్టుగా నర్తిస్తూ అభివాదం చేసుకుంటూ పరిచయం చేసుకున్నారు. తొలుత అర్జెంటీనా సుందరీమణి రాగా, చివరగా వెనిజువెలా అందెగత్తె వచ్చింది. అనంతరం గోండు గుస్సాడీ కళాకారులు శ్రీధర్ ఆధ్వర్యంలో నృత్యాన్ని ప్రదర్శించారు. ఆ వెంటనే ఆఫ్రికా ఖండానికి చెందిన దేశాల సుందరీమణులు వచ్చి పరిచయం చేసుకున్నారు. అంగోలా సుందరీమణి ముందు రాగా, చివరగా జింబాబ్వే దేశానికి చెందిన పోటీదారు వచ్చింది. అనంతరం 14 మంది లంబాడీ డప్పు కళాకారులు స్వప్న, అందె భాస్కర్ ఆధ్వర్యంలో నృత్యాన్ని ప్రదర్శించారు. ఆ వెంటనే యూరప్ ఖండానికి చెందిన దేశాల పోటీదారులు వచ్చి పరిచయం చేసుకున్నారు. చివరగా ఒగ్గు డోలు బృందం కళాకారులు 18 మంది ఒగ్గు రవికుమార్ ఆధ్వర్యంలో కళారూపాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా హ్యూమన్ పిరమిడ్ ఏర్పాటు చేసి పైకి ఎక్కిన కళాకారుడు జాతీయ జెండాను రెపరెపలాడేలా చేసిన తీరు ఆకట్టుకుంది. అనంతరం ఆసియా-ఓ యానా దేశాల ప్రతినిధులు స్టేడియంలోకి వచ్చి పరిచయం చేసుకున్నారు. మిస్ ఇండియా నందినీ గుప్తా రాగానే మార్మోగిన స్టేడియం.. చివరి బృందంలో భాగంగా మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా వచ్చినప్పుడు స్టేడియం చప్పట్లు, ఈలలు, కేరింతలతో మార్మోగింది. గోకులంలో గోపిక వస్త్రధారణతో నందినీ గుప్తా స్టేడియంలోకి వచ్చారు. వేషధారణకు తగ్గట్టు తన పరిచయంలో భాగంగా ఆమె కవ్వంతో వెన్న చిలికే అభినయంతో రావటం విశేషం. నేపాల్‌కు చెందిన సుందరీమణి గులాబీ డిజైన్, అదే రంగు రవికతో తెలుపు రంగు చీరకట్టుతో రావటం ఆకట్టుకుంది. బంగ్లాదేశ్, టర్కీ దేశాల ప్రతినిధులు కూడా హాజరుకాగా.. థాయిలాండ్ సుందరీమణి చీరకట్టును పోలిన వస్త్రధారణతో వచ్చింది. శ్రీలంక యువతి నమస్కార ముద్రతో పరిచయం చేసుకుంది. చివరలో వచ్చిన వియత్నాం సుందరి వేగంగా నర్తిస్తూ ఆకట్టుకుంది. ఆస్ట్రేలియా యువతి కౌబాయ్ గెటప్‌లో వచ్చింది.

### పోటీలు ప్రారంభమైనట్టు ప్రకటించిన సీఎం

పరిచయ కార్యక్రమం ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లే, ప్రస్తుత మిస్ వరల్డ్ క్రిస్టీనా పిస్కోవాలు పరిచయం చేసుకుని కరచాలనం చేశారు. అనంతరం ఆ ఇద్దరితో కలిసి ప్రపంచ సుందరి 72వ ఎడిషన్ పోటీలు ప్రారంభమయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహూతులు, పోటీదారుల కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు. పరిచయ కార్యక్రమం ముగిసిన తర్వాత పోటీదారులు అందరూ స్టేడియంలోకి వారివారి జాతీయ జెండాలు చేతపట్టుకుని ఊపుతూ వచ్చారు. చివరగా భారత పతాకాన్ని చేతబూని మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా వచ్చారు. అప్పుడు స్టేడియంలోని ప్రేక్షకులు లేచి నిలబడి కరతాళ ధ్వనులతో స్వాగతం పలికారు. అంతా ప్రపంచ శాంతిని కాంక్షించే మిస్ వరల్డ్ గీతాన్ని బృంద గానంగా ఆలపించారు. - భారత దేశ సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో అసమాన ప్రదర్శన చాటిన సైనికులకు వందనం సమర్పిస్తున్నట్టు వ్యాఖ్యాత ప్రకటించినప్పుడు 'జైహింద్' నినాదాలతో స్టేడియం మార్మోగింది. చివరకు జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. ప్రారంభ వేడుకల్లో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, నగర మేయర్ విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు పాల్గొన్నారు. గొప్ప నగరంలో ఉన్నందుకు పులకిస్తున్నాం: మిస్ వరల్డ్ క్రిస్టీనా పిస్కోవా 'నమస్తే హైదరాబాద్.. నమస్తే తెలంగాణ. ఈ అద్భుతమైన నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవంలో మీ అందరితో కలిసి పాల్గొనటం నాకు గర్వంగా ఉంది. ఈ అద్భుత దేశం, గొప్ప సాంస్కృతిక కేంద్రంలో మేము 'బ్యూటీ విత్ పర్పస్' అనే అద్భుత కార్యక్రమంలో ఐక్యతను చాటుతూ పాల్గొంటున్నాం. తెలంగాణ సంప్రదాయాలు, గొప్ప చరిత్ర, అద్భుత ఆతిథ్యం నన్ను ఎంతగానో ఆకర్షించాయి. మిస్ వరల్డ్ అనేది కేవలం అందం గురించి మాత్రమే కాదు. ఇది ప్రపంచంలో ఓ మార్పును తీసుకువచ్చే లక్ష్యంతో సాగుతుంది. విద్య, సాధికారత, సమాజ సేవ ద్వారా ప్రపంచాన్ని మెరుగుపరచడం ఇందులో భాగం. 109 దేశాల నుంచి వచ్చిన మహిళలు గొప్ప లక్ష్యంతో ఒక్కటిగా ఈ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకు ఇప్పుడు హైదరాబాద్ సరైన వేదికగా నిలి చింది. ఈ నగరంలో సంప్రదాయం-ఆధునికత ఒకదానికొకటి పెనవేసుకుని ఉన్నాయి. ఇక్కడి ఆతిథ్యానికి, ,హృదయపూర్వక స్వాగతానికి ధన్యవాదాలు..' అని మిస్ వరల్డ్ క్రిస్టీనా పిస్కోవా అన్నారు.



మొదటి పేజీ తరువాయి

## ప్రధాని నివాసంలో మరోసారి సమావేశం



కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, అజిత్ దోవల్, సెంటర్ డిఫెన్స్ స్టాఫ్ డైరెక్టర్ అనిల్ చౌహాన్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ జరగడంతో.. తదుపరి తీసుకోవాల్సిన చర్యలేంటి? మే 12న జరిగే చర్చల్లో ఏయే అంశాలను ప్రస్తావించాలి? పాకిస్థాన్ మళ్లీ కవ్వింపులకు పాల్పడితే ఏం చేయాలన్న కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చిస్తున్నట్లు సమాచారం. కాగా.. కాల్పుల విరమణకు ప్రధాని కొన్ని షరతులు విధించినట్లు తెలుస్తోంది. సింధునదీజలాల ఒప్పందం సస్పెన్షన్లో ఎలాంటి మార్పు ఉండదని, కేవలం కాల్పుల విరమణకే అంగీకరిస్తున్నామని చెప్పినట్లు నేషనల్ మీడియాతో కథనాలు వెలువడ్డాయి. కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కూడా ఈ విషయాలనే ప్రస్తావించారు. పాకిస్తాన్‌తో ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై భారతదేశం కట్టుబడి ఉన్నప్పటికీ, మళ్లీ యుద్ధవాతావరణం ఎదురైతే అందుకు భారత సైన్యం పూర్తిగా సిద్ధంగా ఉందని కమోడోర్ ఆర్ నాయర్ తెలిపారు. దేశం సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునేందుకు ఆర్మీ ఎప్పుడూ నిబద్ధతతో ఉంటుందన్నారు. ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ.. ఎనీ టైమ్ యుద్ధానికి సిద్ధంగా ఉంటుందని, శత్రువుల ప్రతిస్పందనకు ధీటుగా బదులివ్వడంలో వెనుకాడబోమన్నారు.

మొదటి పేజీ తరువాయి

## కాల్పుల విరమణకు అంగీకరించినా..
## నిరంతరం సన్నద్ధతతోనే సైన్యం!



ఈ కబురు,ఢిల్లీ: కొన్ని రోజులుగా భారత్, పాక్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ఇరుదేశాల విదేశాంగ శాఖలు ప్రకటించాయి. అయితే, ఈ ప్రకటన అనంతరం భారత సైనికాధికారులు మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై పాక్ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని, అయినప్పటికీ భారత సైన్యం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని వెల్లడించారు. భవిష్యత్తులో పాకిస్థాన్ దాడులకు తెగబడితే దీటుగా సమాధానమిస్తామని స్పష్టం చేశారు.

'కొన్ని రోజులుగా భారత్‌పై పాక్ అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. ఎస్-400, బ్రహ్మోస్ వ్యవస్థలపై వాళ్లు దాడి చేశారనడం అవాస్తవం. సిర్సా, జమ్మూ, బఠిండా, భుజ్‌లపై దాడి పాక్ దాడి చేశామని ప్రచారం చేసింది. అది కూడా అబద్ధం. నలియా, పఠాన్‌కోట్ వాయుసేన స్థావరాలకు నష్టం కలిగించామని, చండీగఢ్ ఆయుధాగారంపై దాడి చేసినట్లు పాక్ తప్పుడు ప్రకటనలు చేసింది. ప్రార్థనా మందిరాలపై భారత్ దాడి చేసిందని అంటోంది. భారత్ లౌకిక దేశం.. ప్రార్థనా మందిరాలపై ఎప్పుడూ దాడి చేయదు. మనం చేసిన ప్రతిదాడులతో పాక్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. పాకిస్థాన్ రాడార్, క్షిపణి రక్షణ వ్యవస్థలను నిర్వీర్యం చేశాం. కర్ధు, సర్గోదా, జకోబాబాద్‌లోని పాక్ వాయుసేన స్థావరాలను భారత దళాలు ధ్వంసం చేశాయి. నియంత్రణ రేఖ పొడవునా పాక్‌కు తీవ్ర నష్టం కలిగించాం. కాల్పుల విరమణకు అంగీకరించినా నిరంతరం సైన్యం పూర్తి సన్నద్ధతతో ఉంటుంది' అని భారత సైనికాధికారులు వివరించారు.

మొదటి పేజీ తరువాయి

# భారత్,పాక్ మధ్య

## కాల్పుల విరమణ ఒప్పందం.



**విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపిన వివరాల ప్రకారం పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) ఈరోజు మధ్యాహ్నం 15:35 గంటలకు భారత డీజీఎంవోకి ఫోన్ చేశారు.**

భారత ప్రామాణిక సమయం ప్రకారం సాయంత్రం 17.00 గంటల నుంచి భూమి, వాయు, సముద్రంపై కాల్పులు, సైనిక చర్యలను ఇరుపక్షాలు నిలిపివేయాలని ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయాలని ఈరోజు రెండు పార్టీలకు ఆదేశాలు అందాయన్నారు. ఈ క్రమంలో డైరెక్టర్ జనరల్ మిలిటరీ ఆపరేషన్స్ మే 12న మధ్యాహ్నం 12 గంటలకు మళ్లీ చర్చించనున్నట్లు వెల్లడించారు.

### దృఢంగా ఉన్న భారత్

కాల్పుల విరమణను ధృవీకరిస్తూ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సైతం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. భారతదేశం, పాకిస్తాన్ ఈరోజు కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయడానికి అంగీకరించాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం నిరంతరం దృఢమైన, అచంచలమైన వైఖరిని ఇలాగే కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. భారత్ పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన ట్రూత్‌సోషల్‌లో శనివారం సాయంత్రం ఓ పోస్ట్ పెట్టారు. "అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టేందుకు భారత్, పాక్ అంగీరించాయి. సరైన సమయంలో ఇరు దేశాలు విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించాయి. అందుకు ధన్యవాదాలు" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్, పాక్ వేర్వేరు ప్రకటనల్లో ధ్రువీకరించాయి.

ట్రంప్ పోస్ట్ చేసిన కాసేపటికే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సైతం ఇదే తరహా ప్రకటన చేశారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. భారత్, పాక్ ప్రధానులు నరేంద్రమోదీ, షెహబాజ్ షరీఫ్, భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసిమ్ మునీర్, ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ దోభాల్, అసిమ్ మాలిక్‌లతో మాట్లాడినట్లు చెప్పారు. తాను, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇందుకు సంబంధించిన చర్చల్లో పాల్గొన్నామని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## యుద్ధప్రాతిపదికన సీతారామ ఎత్తిపోతల పథకం పనులు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. సమస్యలుంటే పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిపాదించిన తరహాలో ఇల్లందు మీదుగా నీరు ఇస్తే జిల్లా మొత్తానికి ప్రయోజనకరంగా ఉంటుందని గుమ్మడి నర్సయ్య మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న డిజైన్ ప్రకారం ముందుకెళ్తూ.. అవసరమైన చోట లింక్ కెనాల్ ద్వారా పనులు చేపట్టవచ్చని ఇంజినీర్లకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో సీతారామ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు జరగలేదన్న మంత్రి ఉత్తమ్ కుమార్.. కాంగ్రెస్ ప్రభుత్వ కృషితో నీటి కేటాయింపులు జరిగాయని మరోసారి తెలిపారు. సీతమ్మ సాగర్ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించామని.. పనులు వేగవంతం చేసి పూర్తి చేస్తామన్నారు.

# కాల్పుల విరమణ.. ఉల్లంఘన

భూ, గగన, సముద్ర తలాల్లో పూర్తిస్థాయిలో కొనసాగుతుంది" అని విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ మీడియాకు వెల్లడించారు. కానీ కాసేపటికే పాక్ వంకర బుద్ధి ప్రదర్శించింది. శనివారం రాత్రి ఏడింటి నుంచీ మరోసారి దాడులకు దిగింది. సరిహద్దుల గుండా మళ్లీ డ్రోన్ ప్రయోగాలకు, కాల్పులకు తెగబడింది. కోరి కుదుర్చుకున్న విరమణ ఒప్పందానికి గంటల వ్యవధిలోనే తూట్లు పొడిచి తాను ధూర్త దేశాన్నేనని మరోసారి నిరూపించుకుంది. ఈ పరిణామంపై భారత్ మండిపడింది. రాత్రి 11 గంటలకు మిస్రీ మరోసారి మీడియా ముందుకొచ్చారు. ఓవైపు విరమణ అంటూనే మరోవైపు సరిహద్దుల వెంబడి పాక్ తిరిగి దాడులు, కాల్పులకు దిగిందంటూ ధ్వజమెత్తారు.

### ఒప్పందం కుదిరిందన్న ట్రంప్

పాక్ దొంగ నాటకాల నడుమ శనివారం రోజంతా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి దాటేదాకా పాక్ సైన్యం క్షిపణి, డ్రోన్ దాడులు, సరిహద్దుల వెంబడి కాల్పులు కొనసాగించింది. వాటికి దీటుగా బదులిచ్చిన భారత్ శనివారం తెల్లవారుజాము నుంచీ తీవ్రస్థాయిలో ప్రతి దాడులకు దిగింది. ఆరు పాక్ వైమానిక, రెండు రాడార్ కేంద్రాలను నేలమట్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇరుదేశాల నడుమ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనూహ్య ప్రకటన చేశారు. సొంత సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్ సోషల్‌లో సాయంత్రం ఐదింటి ప్రాంతంలో ఈ మేరకు పోస్ట్ చేశారు. "అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా జరిగిన చర్చోపచర్చల అనంతరం ఎట్టకేలకు ఇరు దేశాలూ తక్షణం పూర్తిస్థాయి కాల్పుల విరమణకు అంగీకరించాయి" అని పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా అవే వ్యాఖ్యలు చేశారు. ప్రధానులు నరేంద్ర మోదీ, షహబాజ్ షరీఫ్‌లకు అభినందనలు తెలిపారు. ట్రంప్ బృందం ఈ దిశగా అద్భుతంగా పని చేసిందని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చెప్పుకొచ్చారు. సాయంత్రం ఆరింటికి విదేశాంగ కార్యదర్శి మిస్రీ మీడియా ముందుకొచ్చారు. "పాక్ విజ్ఞప్తి మేరకే విరమణకు ఒప్పుకున్నాం. శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు పాక్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ భారత డీజీఎంఓకు ఫోన్ చేశారు. వారి నడుమ చర్చల ఫలితంగా ఈ మేరకు ఒప్పందం కుదిరింది" అని స్పష్టం చేశారు. దీనిపై డీజీఎంఓల నడుమ సోమవారం పూర్తిస్థాయి చర్చలు జరుగుతాయని వెల్లడించారు. "శాంతి సాధనకు ఇది నూతన ప్రారంభం. కాల్పుల విరమణకు చొరవ చూపినందుకు ట్రంప్, వాన్స్, రూబియోలకు కృతజ్ఞతలు" అంటూ పాక్ ప్రధాని షహబాజ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్, పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) అధినేత బిలావల్ భుట్టో, ప్రజాప్రతినిధులు తదితరులు ఒప్పందాన్ని స్వాగతించారు. అనంతరం తన గగనతలాన్ని తెరుస్తున్నట్టు పాక్ ప్రకటించింది. కొద్ది గంటలైనా గడవకుండానే పాక్ తన బుద్ధి బయటపెట్టుకుంది. విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ శనివారం రాత్రి ఏడింటి నుంచే మరోసారి సరిహద్దుల వెంబడి దాడులకు దిగింది. జమ్మూ కశ్మీర్ మొదలుకుని గుజరాత్ దాకా పలుచోట్ల డ్రోన్ దాడులు జరిగాయి. శ్రీనగర్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. బారాముల్లా తదితర చోట్ల సైనిక స్థావరాల సమీపంలో డ్రోన్లు ఎగురుతూ కనిపించాయి. దీనిపై జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. "శ్రీనగర్ అంతటా పేలుళ్ల శబ్దాలే. ఏమిటిది? విరమణకు అప్పుడే తూట్లా?" అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు మొదలయ్యాయి. పాక్ దాడులకు మన సైన్యం దీటుగా బదులిచ్చింది. జమ్మూ, శ్రీనగర్, గుజరాత్‌లోని భుజ్ తదితర చోట్ల పాక్ డ్రోన్లను బలగాలు కూల్చేశాయి. కచ్ తదితర చోట్ల కూడా డ్రోన్లు కనిపించినట్టు రాష్ట్ర మంత్రి సంఘవి ధ్రువీకరించారు. ముందుజాగ్రత్తగా సరిహద్దు రాష్ట్రాల్లో పలు చోట్ల కరెంటు సరఫరా నిలిపేసి బ్లాకౌట్ పాటించారు. అయితే శనివారం అర్ధరాత్రికల్లా పాక్ వెనక్కు తగ్గిందని, నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు దాదాపుగా ఆగిపోయాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని గంటల్లోనే పాక్ ఉల్లంఘించింది. ఇది అత్యంత దుర్మార్గం. ఇందుకు పూర్తి బాధ్యత ఆ దేశానిదే. దీన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాం. మతిలేని చర్యలను ఇకనైనా కట్టిపెట్టి కాల్పుల విరమణ ఒప్పందానికి పాక్ పూర్తిస్థాయిలో కట్టుబడాలి. లేదంటే తీవ్రస్థాయిలో ప్రతిక్రియ తప్పదు. దాడులను దీటుగా తిప్పికొట్టాల్సిందిగా సైన్యానికి పూర్తిస్థాయి ఆదేశాలిచ్చాం.



# పాక్‌లో ఇంధన కొరత.. 48 గంటల పాటు పెట్రోల్ బంక్‌లు మూసివేత

**పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో 48 గంటల పాటు అన్ని పెట్రోల్ బంక్‌లు మూసివేస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి.**

ఈ కబురు: భారత్‌తో ఉద్రిక్తతలు పెంచుకుంటూ భంగపాటుకు గురవుతున్న పాకిస్థాన్ కు స్వదేశంలో మరో సంక్షోభం ఎదురైనట్లు తెలుస్తోంది. అక్కడ దేశవ్యాప్తంగా ఇంధన కొరత ఏర్పడినట్లు సమాచారం. దీంతో రాజధాని నగరమైన ఇస్లామాబాద్‌లో రెండు రోజుల పాటు పెట్రోల్ బంక్‌లు అన్నింటినీ మూసివేయాలని నిర్ణయించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. శనివారం నుంచి రాబోయే 48 గంటల పాటు ఇస్లామాబాద్ లోని అన్ని పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్లను పూర్తిగా మూసివేయాలని అక్కడి పరిపాలనా యంత్రాంగం నిర్ణయించింది. ఈమేరకు నేటి ఉదయం తక్షణ ఉత్తర్వులు జారీ చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ అనూహ్య నిర్ణయం వెనక కారణాలేంటనేది తెలియరానప్పటికీ.. ఇంధన కొరత కారణంగానే బంక్‌లను మూసివేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా నిల్వలను పెంచుకోవడం కోసమే ఈ చర్యలు చేపట్టి ఉంటుందని సమాచారం.

మూడు వైమానిక స్థావరాలపై భారత్ దాడులు: వెల్లడించిన పాక్ సైన్యం ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో అల్లాడిపోతున్న పాకిస్థాన్‌ను.. భారత్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త వాతావరణం మరింత కుదేలు చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. యుద్ధం తీవ్రతరమైతే నిత్యావసరాల కొనుగోలుకు కూడా దాయాది వద్ద ఆర్థిక వనరులు ఉండవని అంటున్నారు. ఈ క్రమంలోనే పాకిస్థాన్ అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) ముందు మరోసారి సాయం కోసం అర్థించింది. తమ అభ్యర్థనను అంగీకరించి ఐఎంఎఫ్ ఒక బిలియన్ డాలర్ల సాయాన్ని అందించేందుకు అంగీకరించిందని పాక్ ప్రధాని కార్యాలయం తెలిపింది.

**ఐఎంఎఫ్ సాయంపై ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం**

పాక్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి సాయం అందించడంపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ''పూంఛ్, రాజౌరి, ఉరి వంటి చాలా ప్రాంతాలను నిర్వీర్యం చేసేందుకు పాక్ తమ ఆయుధాలను వాడుతుంటే.. ఆ దేశానికి ఐఎంఎఫ్ అత్యవసర సాయం అందించింది. అలాంటప్పుడు భారత్‌పాక్ ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని అంతర్జాతీయ సమాజం ఎలా చెబుతుందో అర్థం కావట్లేదు'' అని ఒమర్ విమర్శలు గుప్పించారు.



# ఆపరేషన్ సిందూర్‌లో హతమైన
## టాప్ టెర్రరిస్ట్‌లు వీళ్లే.. వివరాలు వెల్లడి..!



**ఆపరేషన్ సిందూర్‌లో హతమైన వారిలో ఐదుగురు కీలక ఉగ్రవాదులు ఉన్నారు. వారి వివరాలు తాజాగా బయటికొచ్చాయి.**

ఈ కబురు: పహల్గాం ఉగ్రదాడికి భారత్ గట్టిగా బదులు తీర్చుకుంది. లష్కరే తయ్యిబా, జైషే ఉగ్రముఠాలే లక్ష్యంగా వాటి స్థావరాలపై బాంబులతో విరుచుకుపడింది. మే 7వ తేదీన అర్ధరాత్రి దాటిన తర్వాత పాక్, పీఓకేలో జరిపిన మెరుపు దాడుల్లో తొమ్మిది కీలక ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసింది. ఈ 'ఆపరేషన్ సిందూర్'లో కనీసం 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ఇటీవల కేంద్రం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో ఐదుగురు కీలక ఉగ్ర నాయకులను కూడా మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. వారి వివరాలు తాజాగా వెల్లడయ్యాయి.జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజార్ ఇద్దరు బావమరుదులతో పాటు లష్కరే తయ్యిబా ముఠాకు చెందిన కీలక ఉగ్రవాది, మరో ఇద్దరు ముష్కరులు హతమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలు వెల్లడించినట్లుగా పేర్కొంటూ ఆంగ్ల మీడియాలో ఓ జాబితా బయటికొచ్చింది.

**1. ముదస్సర్ ఖదాయిన్ ఖాస్ అలియాస్ అబు జుండాల్**

ఇతడు లష్కరే తయ్యిబా ముఠాకు చెందిన కీలక ఉగ్రవాది. ఇతడి అంత్యక్రియలను పాక్ ఆర్మీ లాంఛనాలతో నిర్వహించినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ అబ్దుల్ రౌఫ్ నేతృత్వంలోని జరిగిన ఈ కార్యక్రమానికి పాక్ ఆర్మీ చీఫ్, పంజాబ్ (పాక్‌లోని) సీఎం, ఐజీ పాల్గొన్నట్లు సమాచారం.

పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది: భారత్

**2. హాఫీజ్ మహమ్మద్ జమీల్**

జైషే మహమ్మద్ ఉగ్ర ముఠాలోని కీలక సభ్యుడు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు మసూద్ అజార్‌కు పెద్ద బావమరిది.

**3. మహమ్మద్ యూసఫ్ అజార్ అలియాస్ ఉస్తాద్ జీ అలియాస్ సలీమ్ అలియాస్ సాహబ్**

జైషే ముఠాకు చెందిన మరో కీలక ఉగ్రవాది ఇతడు. మసూద్ అజార్ మరో బావమరిది అయిన అజార్.. ఐసీ814 విమాన హైజాక్ ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

**4. ఖలీద్ అలియాస్ అబు అకాస**

లష్కరే తయ్యిబాకు చెందిన టాప్ ఉగ్రవాది. జమ్మూకశ్మీర్‌లో పలు ఉగ్రదాడులకు నేతృత్వం వహించాడు. అఫ్గానిస్థాన్ నుంచి ఆయుధాల స్మగ్లింగ్ చేసేవాడు. ఫైసలాబాద్‌లో జరిగిన ఇతడి అంత్యక్రియలకు పాక్‌లోని సీనియర్ ఆర్మీ అధికారులు, స్థానిక డిప్యూటీ కమిషనర్ హాజరైనట్లు సమాచారం.

**5. మహమ్మద్ హసన్ ఖాన్**

జైషే మహమ్మద్ ముఠాలో కీలక సభ్యుడు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని జైషే ఆపరేషనల్ కమాండర్ ముఫ్తి అస్గర్ ఖాన్ కశ్మీరీ కుమారుడు. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించడంలో కీలక పాత్ర పోషించాడు.

జైషే, లష్కరే ముఠాల కీలక స్థావరాలే లక్ష్యంగా భారత్ ఈ మెరుపుదాడులు చేపట్టిన సంగతి తెలిసిందే. భారత్ టార్గెట్ చేసిన వాటిల్లో.. లాహోర్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలో గల లష్కరే తోయిబా ఉగ్ర శిబిరం కూడా ఉంది. ఇక్కడ 26/11 ముంబయి దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ శిక్షణ తీసుకున్నారు. ఇక, జైషేకు చెందిన ప్రధాన కేంద్రం బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్‌పైనా దాడి జరిగింది. ఈ దాడిలో మసూద్ అజార్ కుటుంబంలోని 10 మంది మృతిచెందినట్లు వార్తలు వచ్చాయి.

# మే 27నే కేరళకు నైరుతి రుతుపవనాలు



ఈ కబురు,న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే పలకరించనున్నాయి. సాధారణంగానే జూన్ ఒకటో తేదీన నైరుతి కేరళలోకి ప్రవేశిస్తాయి. అంతకంటే ముందుగా మే 27వ తేదీనే కేరళను తాకే అవకాశాలున్నాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) శనివారం తెలిపింది. అదే జరిగితే 2009 తర్వాత మొదటిసారిగా రుతుపవనాలు మేలోనే వచ్చినట్లవుతుందని పేర్కొంది. 2009లో చాలా ముందుగా అంటే మే 23వ తేదీనే భారత ప్రధాన భూభాగాన్ని తాకాయి. సాధారణంగా జూలై 8వ తేదీకల్లా దేశం మొత్తానికి రుతుపవనాలు వ్యాప్తి చెందుతాయి.
తిరిగి సెప్టెంబరు 17వ తేదీన వాయువ్య భారతం నుంచి ఉపసంహరణ మొదలై అక్టోబర్ 15కల్లా ముగుస్తుంది. గతేడాది మే 30న, అంతకు ముందు 2023లో జూన్ 8న కేరళను రుతుపవనాలు తాకాయి. అయితే, రుతు పవనాలు ప్రవేశించడానికి, ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా నమోదయ్యే వర్షపాతానికి ఎటువంటి సంబంధం లేదని ఐఎండీ అధికారులు తెలిపారు.
రుతుపవనాలు కేరళలోకి సాధారణం కంటే ముందుగా గానీ లేక ఆలస్యంగా గానీ తాకాయంటే దేశవ్యాప్తంగా అవి విస్తరిస్తాయని చెప్పలేమని అన్నారు. స్థానిక, ప్రాంతీయ, ప్రపంచ వ్యాప్తంగా ఉండే అనేక పరిస్థితులపై రుతు పవనాల వైఖరి ఆధారపడి ఉంటుందని వివరించారు. 2025 రుతుపవన సీజన్‌లో మొత్తమ్మీద సాధారణం కంటే

# కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్
## ఉల్లంఘించడం అత్యంత దుర్మార్గం: విక్రమ్ మిస్రీ



కాల్పుల విరమణ అవగాహనను పాక్ ఉల్లంఘించడం సరికాదన్నారు. డీజీఎంవో మధ్య జరిగిన అవగాహనను ఉల్లంఘించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. కొన్ని గంటలుగా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, ఇది అత్యంత దుర్మార్గమని ఘాటుగా స్పందించారు. కాల్పుల ఉల్లంఘనకు సంపూర్ణ బాధ్యత పాక్‌దేనని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో పాక్ ఉల్లంఘనలకు సైన్యం తగిన విధంగా జవాబిస్తుందన్నారు. పాక్ అతిక్రమణను నిలువరించేందుకు సైన్యానికి సంపూర్ణ అధికారాలు ఇచ్చామని తెలిపారు. ఇప్పటికైనా ఈ ఉల్లంఘనలను పాకిస్థాన్ నిలువరిస్తుందని ఆశిస్తున్నట్టు విక్రమ్ మిస్రీ చెప్పారు.


''మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారు'' అని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఆ తర్వాత కొన్ని గంటలకే పాక్ నుంచి డ్రోన్లు భారత భూ భాగంలోకి దూసుకొచ్చాయి. ఎక్కడికక్కడ డ్రోన్‌లను సైన్యం నిర్వీర్యం చేస్తోంది. శ్రీనగర్‌లోని 25 కార్ప్స్ ప్రధాన కార్యాలయం వద్ద కనిపించిన అన్ని డ్రోన్లను నిర్వీర్యం చేసినట్టు సైనిక వర్గాలు తెలిపాయి. మరో వైపు శ్రీనగర్‌లో కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయని సీఎం ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు.

# పాక్ దాడులు.. మృతుల కుటుంబాలకు
## రూ.10లక్షల పరిహారం



పహల్గాం దాడికి ప్రతీకారంగా ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో.. పాక్ కూడా సరిహద్దు ప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడుతోంది. కశ్మీర్‌లోని శ్రీనగర్, రాజౌరి, పూంఛ్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో పాక్ డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో జమ్మూకశ్మీర్ ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థప్పా సహా దాదాపు 20మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. పౌరులు, ప్రభుత్వ ఉన్నతాధికారి మృతి పట్ల జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరోజు ముందే తాను అధ్యక్షత వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని.. ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు.
శనివారం వేకువజామున కూడా భారత్‌పై పాకిస్థాన్ సైన్యం దాడులకు పాల్పడింది. రాత్రి నుంచే సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబు పేలుళ్లు వినిపించడంతో అధికారులు అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి 'బ్లాకౌట్' పాటించారు. శ్రీనగర్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో ఉదయం కూడా పేలుళ్ల శబ్దాలు వచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాగా పాక్ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో మరోసారి శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భారీగా పేలుళ్లు సంభవించినట్లు శబ్దాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

# సరిహద్దుల్లో ఉద్రిక్తత.. శ్రీనగర్ నుంచి స్వస్థలాలకు తెలుగు విద్యార్థులు




**భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.**

శ్రీనగర్: భారత్‌పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లోని షేర్‌ఇకశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం లో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందులో 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. వీరిలో పలువురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్, వర్సిటీ డీన్‌తో మాట్లాడారు. సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. దీంతో ఏపీ, తెలంగాణ, తమిళనాడుకు చెందిన మొత్తం 23 మంది విద్యార్థులను బస్సుల్లో శ్రీనగర్ నుంచి దిల్లీకి పంపించారు. అక్కడి నుంచి స్వస్థలాలకు చేరుకోనున్నారు.

# పదేళ్లలో తెలంగాణను అప్పుల పాల్జేశారు

**అశ్వారావుపేటలో విద్యుత్తు ఉపకేంద్రాలకు శంకుస్థాపన కార్యక్రమంలో భట్టి, పొంగులేటి, రామసహాయం రఘురాంరెడ్డి, ఇతర నాయకులు**

అశ్వారావుపేట, : రాష్ట్రాన్ని పాలించడం కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి రాదంటున్న భారాస అధినేత కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ధనిక తెలంగాణను అప్పగిస్తే రూ.7.50 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారని.. 'ఆ పాపాలను ఒక్కొక్కటిగా కడిగేస్తూ కొత్త రుణాలు చేయకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్‌కు పాలించడం చేతకాదా?' అని ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ ఆవరణలో శనివారం ఆరు విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాలకు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణ, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు.
ఏడాదిలో 57 వేల కొలువులిచ్చాం
''పదేళ్ల పాలనలో నాటి సర్కారు కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు గోదాట్లో పోసింది. రాష్ట్రంలో ఏకకాలంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు రూ.3500 కోట్లతో చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 57 వేల ఉద్యోగాలు ఇచ్చాం. మరో 30 వేలు ఇచ్చేందుకు సిద్ధం చేశాం. రూ.9 వేల కోట్లతో రాజీవ్ యువవికాసం, రూ.1975 కోట్లతో రైతుబీమా, రూ.13 వేల కోట్లతో 90 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చే సన్నబియ్యం పథకం అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. రూ.12,500 కోట్లతో 'ఇందిర సౌర గిరి జలవికాస్' కింద ఆర్వోఎఫ్ఆర్ హక్కుపత్రాలు పొందిన గిరిజనుల భూముల్లో సౌరవిద్యుత్తు, బిందు సేద్యం పరికరాలతో పాటు ఉద్యాన పంటల పెంపకం చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేశాం. ఈనెల 18న మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి రేవంత్ లాంఛనంగా ప్రారంభిస్తారు'' అని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు నియోజకవర్గానికి 4 వేల మందికి తగ్గకుండా రాజీవ్ యువ వికాసం పథకాన్ని జూన్ 2న ప్రారంభించనున్నామని తెలిపారు. భారాస ప్రభుత్వం చేసింది గోరంత ప్రచారం చేసుకున్నది కొండంత అని.. 202324లో ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం రూ.1052 కోట్లు ఖర్చు చేశారంటూ విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, రాందాస్ నాయక్, నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబు, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, జూపల్లి రమేశ్ పాల్గొన్నారు.





## డొనాల్డ్ ట్రంప్ ట్వీట్: సోషల్ మీడియాలో ఇదే హాట్ టాపిక్

భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమవుతున్నవేళ, అమెరికా అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' ట్వీట్ చేశారు. ట్రంప్ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. సాయంత్రం 5:33 గంటలకు చేసిన ఈ ట్వీట్‌కు ఏకంగా 18.7 మిలియన్స్ వీక్షణలు (సాయంత్రం 7:05 గంటలకు), 35వేల కంటే ఎక్కువ కామెంట్స్, 72వేల కంటే ఎక్కువ రీట్వీట్స్ వచ్చాయి. సుమారు మూడు లక్షల కంటే ఎక్కువ లైకులు పొందింది.

భారత్ పాక్‌లతో చర్చలు జరిపాము. ఇరు దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించాము. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి. రెండు దేశాలకు నా అభినందనలు అంటూ ట్రంప్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.

కాల్పుల విరమణ భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అధికారికంగా పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విమరణ అమలులోకి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ రోజు మధ్యాహ్నం 3.35 గంటలకు పాక్ DGMO.. భారత్ DGMOకు ఫోన్ చేసి కాల్పులు విమరణ చేయాలని కోరినట్లు మిస్రీ పేర్కొన్నారు. పాకిస్తాన్ అభ్యర్థనతో.. భారత్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు చెప్పారు. కాగా ఎల్లుండి (సోమవారం, మే 12) మధ్యాహ్నం 12 గంటలకు ఇరుదేశాల మిలటరీ జనరల్స్ మధ్య చర్చలు జరుగుతాయని ప్రకటించారు.




## 24 గంటల్లో 8000 బుకింగ్స్: దూసుకెళ్తున్న విండ్సర్ ఈవీ ప్రో

జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా లాంచ్ చేసిన కొత్త 'విండ్సర్ ఈవీ ప్రో' ఎలక్ట్రిక్ కారు బుకింగ్స్ ప్రారంభమైన కేవలం 24 గంటల్లో 8,000 కంటే ఎక్కువ బుకింగ్స్ పొందింది. కాగా కంపెనీ ఈ కారు ధరలను కూడా ఇప్పుడు రూ. 60000 వరకు పెంచింది. దీంతో విండ్సర్ ఈవీ ప్రో ప్రారంభ ధర రూ. 18.10 లక్షలకు (ఎక్స్ షోరూమ్) చేరింది.

ఎంజీ మోటార్ ఇండియా లాంచ్ చేసిన కొత్త విండ్సర్ ఈవీ ప్రో.. ఇప్పుడు 52.9 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్ కలిగి 449 కిమీ రేంజ్ అందిస్తుంది. ఇందులో ఎలక్ట్రిక్ మోటారు 136 హార్స్ పవర్, 200 Nm టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది.

చూడటానికి సాధారణ ఎంజీ విండ్సర్ ఈవీ ప్రో మాదిరిగా ఉన్నప్పటికీ.. ఇందులో కొన్ని అప్డేటెడ్ ఫీచర్స్ ఉన్నాయి. ఈ లేటెస్ట్ వెర్షన్ లెవల్ 2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ కూడా పొందుతుంది. అంతే కాకుండా ఇది సెలాడాన్ బ్లూ, అరోరా సిల్వర్, గ్లేజ్ రెడ్ అనే మూడు కొత్త కలర్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది.




# తగ్గినట్టే తగ్గి.. తులం బంగారం ఇప్పుడు..

**దేశంలో బంగారం ధరలు తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరిగాయి. క్రితం రోజున భారీగా క్షీణించిన పసిడి ధరలు నేడు (మే 10) కాస్త ఎగిశాయి. మరోసారి తగ్గుతుందని ఆశించిన కొనుగోలుదారులకు నేడు నిరాశ ఎదురైంది. మే 10 నాటికి దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్, 22 క్యారెట్ బంగారం ధరలు ఈ విధంగా ఉన్నాయి..**

**తెలుగు రాష్ట్రాల్లో..**

**- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,680**

**- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,450**

హైదరాబాద్, విజయవాడ సహా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, స్థానిక జ్యువెలరీ షాపుల్లో మేకింగ్ ఛార్జీలు,జీఎస్టీ కారణంగా కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.330, రూ.300 చొప్పున పెరిగాయి.

**ఇది చదివారా? బంగారం మాయలో పడొద్దు.. సీఏ చెప్పిన లెక్కలు చూస్తే..**

**చెన్నైలో..**

**- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,680**

**- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,450**

చెన్నైలో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే కొంచెం ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ పోర్ట్ సౌకర్యాలు, డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేస్తున్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.330, రూ.300 చొప్పున పెరిగాయి.

**ఢిల్లీలో..**

**- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,830**

**- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,600**

ఢిల్లీలో బంగారం ధరలు రవాణా ఖర్చులు, స్థానిక ట్యాక్స్‌ల కారణంగా కొంత ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ నగరంలో బంగారం కొనుగోలుదారులు హాల్‌మార్క్ ఆభరణాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.330, రూ.300 చొప్పున పెరిగాయి.

**ముంబైలో..**

**- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,680**

**- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,450**

ముంబైలో బంగారం ధరలు స్థానిక డిమాండ్, జ్యువెలరీ డిజైన్‌లపై ఆధారపడి మారుతూ ఉంటాయి. ఈ నగరంలో బంగారం కొనుగోలు చేసే ముందు పలు జ్యువెలరీ షాపుల ధరలను సరిపోల్చడం మంచిది. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.330, రూ.300 చొప్పున పెరిగాయి.

**బెంగళూరులో..**

**- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,680**

**- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,450**

బెంగళూరులో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి, కానీ స్థానిక ఆర్థిక పరిస్థితులు, ఫెస్టివల్ సీజన్ డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేయవచ్చు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.330, రూ.300 చొప్పున పెరిగాయి.

**వెండి ధరలు ఇలా..**

దేశవ్యాప్తంగా వెండి ధరల్లో నేడు స్వల్ప తగ్గుదల నమోదైంది. నిన్నటితో పోలిస్తే ఈరోజు వెండి కేజీ మీద రూ.100 మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ ధర రూ.1,10,900 వద్ద, ఢిల్లీ ప్రాంతంలో రూ. 98,900 వద్ద కొనసాగుతోంది.

## ఎస్‌బీఐ, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుపై భారీ జరిమానా




**భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలు పాటించలేదనే కారణంతో ప్రముఖ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుపై జరిమానా విధించింది. ఆర్థిక క్రమశిక్షణను అమలు చేయడానికి, నిర్దేశించిన మార్గదర్శకాలకు బ్యాంకులు కట్టుబడి ఉండేలా ఈ జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది**

బ్యాంకుల రుణాలు, అడ్వాన్స్‌లు, అనధికార ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీల్లో కస్టమర్ ప్రొటెక్షన్‌కు సంబంధించిన అంశాలు, కరెంట్ అకౌంట్ ఖాతాలు ఓపెన్ చేయడంలో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. దాంతో ఎస్‌బీఐకి రూ.1.72 కోట్ల జరిమానా విధిస్తున్నట్లు పేర్కొంది. జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 ప్రకారం నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.1 కోటి జరిమానా విధిస్తున్నట్లు చెప్పింది. ఈ జరిమానాలు బ్యాంకింగ్ రంగంలో మరింత జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి దిద్దుబాటు చర్యగా పనిచేస్తాయని పేర్కొంది.

**బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రభావం**

రెగ్యులేటరీ నిబంధనల అమలు ఆర్థిక సంస్థలపై ఆర్‌బీఐ కఠినమైన పర్యవేక్షణను ప్రతిబింబిస్తుంది. అంతర్గత నియంత్రణలను బలోపేతం చేయడానికి, కస్టమర్ రక్షణ యంత్రాంగాలను మెరుగుపరచడానికి బ్యాంకులను ప్రోత్సహిస్తుంది. ఈ చర్యలు ఇతర బ్యాంకులకు హెచ్చరికగా కూడా పనిచేస్తాయని కొందరు భావిస్తున్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని, వాటిని పాటించడంలో లోపాలను నివారించాలని కోరుతున్నారు.



## సరిహద్దు రాష్ట్రాల్లో ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం

భారత్‌పాక్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కార్పొరేట్ కంపెనీలు సరిహద్దు రాష్ట్రాల్లోని తమ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నాయి. ఇరు దేశాల పరస్పర దాడులకు ప్రతిస్పందనగా ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేయాలని ఈవై ఇండియా సూచించింది. యుద్ధ కార్యకలాపాలు, ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఢిల్లీ ఎన్‌సీఆర్, ఛండీగఢ్, జైపూర్, అహ్మదాబాద్‌లోని సిబ్బంది ఈ మేరకు వర్క్ ఫ్రం హోం సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపింది.

డెలాయిట్, కేపీఎంజీ, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా సహా ఇతర ఐటీ, కన్సల్టింగ్ సంస్థలు కూడా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాయి. అత్యవసరం కాని ప్రయాణాలపై ఆంక్షలు విధించామని, సరిహద్దు రాష్ట్రాల్లోని ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇప్పటికే సూచించారు. భారత్‌పాక్ యుద్ధ నేపథ్యంలో పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఢిల్లీ, గుజరాత్, పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో ఎమర్జెన్సీ ప్రోటోకాల్ విధించిన సంగతి తెలిసిందే.

సమస్యాత్మక జిల్లాల్లో తాత్కాలిక పాఠశాలల మూసివేతలు, విద్యుత్ అంతరాయాలు కొనసాగుతున్నాయి. సున్నితమైన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాక్ ప్రయోగించిన పలు డ్రోన్లు, క్షిపణులను భారత గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకున్నాయి.

# మనది దూకుడు కాదు.. దశాబ్దాల బాధకు సమాధానం: జాన్వీకపూర్



**ఇటీవల జమ్మూలో జరిగిన దాడి విజువల్స్ చూసి తాను దిగ్భ్రాంతికి గురైనట్లు జాన్వీకపూర్ అన్నారు.**

భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో జమ్మూపై దాడులకు సంబంధించిన విజువల్స్ చూసి దిగ్భ్రాంతికి గురైనట్లు జాన్వీ కపూర్ అన్నారు. గురువారం పాకిస్థాన్ చేసిన డ్రోన్ దాడులు తనను ఎంతో బాధించాయన్నారు. దీనిపై తన ఇన్‌స్టాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

“ఇది నేను ఇప్పటివరకూ ఎప్పుడూ అనుభవించని ఆందోళన. ఇన్ని రోజులు విదేశాల్లో ఇలాంటి దాడులు జరుగుతుంటే శాంతిని పాటించాలని కోరుకున్నాం. కానీ.. ఇప్పుడు అదే పరిస్థితి మనవరకు వచ్చింది. భారత్ ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వదు. దశాబ్దాలుగా ఇలాంటి దాడులు ఎదుర్కొన్న తర్వాత.. ఇప్పుడు తిరిగి ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుంది. మనది దూకుడు కాదు.. దశాబ్దాల బాధకు సమాధానం. మన సాయుధ దళాలు శత్రుదేశంపై వీరోచిత పోరాటం చేస్తున్నాయి . మనల్ని, మన భూమిని, మన సార్వభౌమత్వాన్ని మన సైనికులు రక్షిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మనమంతా కూడా ఐక్యంగా ఉంటూ వారికి మద్దతు ఇద్దాం. దాయది దేశం అరాచకత్వాన్ని ఇకపై చూసీచూడనట్లు ఉండేది లేదని.. గట్టిగా బదులిస్తామని వారికి తెలిసొచ్చేలా చేద్దాం. ఈ యుద్ధంలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం నన్ను బాధిస్తోంది. త్వరలోనే దీనికి శాశ్వతంగా ముగింపు పలకాలని ఆశిస్తున్నాను. మన సైనికుల కోసం ప్రార్థిస్తుంటాను” అని జాన్వీ రాసుకొచ్చారు.ఎప్పటికీ క్షమాపణలు చెప్పను..

భారత్‌ను ప్రశంసించినందుకు నటిపై ట్రోల్స్ఇక ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ విరుచుకుపడింది. దీన్ని ఓర్వలేని పాక్ మరోసారి దుస్సాహసానికి ఒడిగట్టింది. క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలను మన దేశం పైకి ప్రయోగిస్తోంది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్‌ల పైకి వాటిని వదులుతోంది. పాక్ ప్రయత్నాలను భారత్ సమర్థంగా తిప్పికొడుతోంది.



## అప్పుడు నేనెంతో బాధపడ్డా.. ఫెయిల్యూర్‌ని అనుకున్నా: సమంత

**‘శుభం’ తో నిర్మాతగా తొలి అడుగు వేశారు నటి సమంత . ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె తన కెరీర్ గురించి పలు ఆసక్తికర విషయాలు బయటపెట్టారు.**

‘శుభం’ తో నిర్మాతగా తొలి అడుగు వేశారు నటి సమంత . ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తన కెరీర్ గురించి పలు ఆసక్తికర విషయాలు బయటపెట్టారు. త్వరలోనే తాను ‘మా ఇంటి బంగారం’ సెట్‌లోకి అడుగుపెడతానని చెప్పారు. యాక్టింగ్ నుంచి కొంతకాలం బ్రేక్ తీసుకొని.. తిరిగి సెట్‌లోకి అడుగుపెట్టినప్పుడు ఎంతో కంగారుపడ్డానన్నారు. జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ‘ఊ అంటావా’ పాట ఆఫర్ వచ్చిందని దానిని తానొక సవాలుగా స్వీకరించానని తెలిపారు. తన తండ్రి మరణించిన రోజును గుర్తుచేసుకున్నారు.

**అప్పుడెంతో బాధపడ్డా..!**

“కెరీర్ ఆరంభంలోనే సక్సెస్ చూశా. వరుస సినిమాలు విజయాలు అందుకున్నాయి. దాంతో అందరూ నన్ను గోల్డెన్ లెగ్ ఆఫ్ తెలుగు సినిమా అని పిలిచేవారు. పోటీలో భాగమైపోయా. కానీ ఫెయిల్యూర్స్ వల్లే ఎన్నో విషయాలు నేర్చుకున్నా. నా సినిమా తొలిసారి ఫ్లాప్ అయినప్పుడు కుమిలిపోయా. నేనొక ఫెయిల్యూర్‌ని అనుకున్నా. ఇన్నేళ్ల కెరీర్ తర్వాత సక్సెస్ అంటే నా దృష్టిలో నిర్వచనం మారింది. స్వేచ్ఛగా జీవించడమే విజయం అని అర్థమైంది. ఇప్పుడు నేను సక్సెస్‌లో లేనని చాలామంది అనుకుంటారు. కానీ, గతంతో పోలిస్తే ఇప్పుడే నేను విజయవంతంగా రాణిస్తున్నా. ప్రతి రోజూ నాకిష్టమైన పనులతో కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకుసాగుతున్నా”

**భయపడ్డా..!**

“ఆరోగ్యపరమైన సమస్యల రీత్యా కొంతకాలం వర్క్ నుంచి బ్రేక్ తీసుకున్నా. యాక్టింగ్‌ను ఎంతో మిస్ అయ్యా. యాక్టింగ్ మర్చిపోయానేమో అనిపించింది. ‘రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్’ షూట్‌లోకి అడుగుపెట్టిన తొలిరోజు అంత సులువుగా అనిపించలేదు. ఒకసారి యాక్టింగ్‌లోకి దిగితే జీవితాంతం అది మనలో భాగం అవుతుందని అప్పుడు అర్థమైంది”

**‘ఊ అంటావా’.. సవాలు..!**

“‘ఊ అంటావా’ ఆఫర్ వచ్చినప్పుడు చాలామంది చేయొద్దని చెప్పారు. నన్ను నేను ఎప్పుడూ ఒక హాట్ గర్ల్‌గా అనుకోలేదు. ఆవిధంగా అస్సలు ఊహించుకోలేదు. అలాంటి సమయంలో ఈ పాట ఆఫర్ వచ్చినప్పుడు ఒక సవాలుగా అనుకొని చేశా. సెట్‌లోకి అడుగు పెట్టినప్పుడు కూడా కంగారుపడ్డా. అయినా ధైర్యంగా సాంగ్ పూర్తి చేశా. మళ్లీ భవిష్యత్తులో అలాంటి పాటల్లో యాక్ట్ చేస్తాననుకోవడం లేదు”

**ఫొటోలు ఇచ్చా..!**

“అభిమానుల వల్లే ఈ స్థాయికి వచ్చాను. అందుకే వాళ్లు ఎప్పుడైనా ఫొటోలు కోసం అడిగితే నో చెప్పను. మా నాన్న చనిపోయిన రోజు ముంబయిలో ఉన్నా. అమ్మ ఫోన్ చేసి విషయం చెప్పగానే షాకయ్యా. ఆయనతో కొంతకాలంగా మాట్లాడటం లేదు. ఆరోజు ఏం జరుగుతుందో కూడా అర్థం కాలేదు. ఫ్లైట్ జర్నీలో ఉన్నప్పుడు.. ఇంటికి వెళ్లే సమయంలో చాలామంది అభిమానులు నన్ను కలిసి ఫొటోల కోసం రిక్వెస్ట్ చేశారు. నేను వారితో నవ్వుతూనే ఫొటోలు దిగా. వాళ్లను బాధపెట్టడం నాకు ఇష్టం లేదు” అని సమంత వివరించారు.




# శ్రీవిష్ణు ‘సింగిల్’కి రికార్డు ఓపెనింగ్స్... తొలి రోజు కలెక్షన్స్ ఎంతంటే?

శ్రీవిష్ణు ఖాతాలో మరో హిట్ పడింది. ఆయన నటించిన తాజా చిత్రం ‘#సింగిల్’ ఈ శుక్రవారం(మే 9) ప్రేక్షకుల ముందుకు వచ్చి.. హిట్ టాక్‌ని సంపాదించుకుంది. శ్రీవిష్ణు వన్‌లైన్ పంచ్‌లు, వెన్నెల కిశోర్ కామెడీ టైమింగ్ అదిరిపోయిందంటూ సినిమా చూసిన ప్రేక్షకులు చెబుతున్నారు. ఫస్ట్ షో నుంచే హిట్ టాక్ రావడంతో తొలిరోజు భారీ కలెక్షన్లనే రాబట్టింది. మొదటి రోజు ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా రూ.4.15 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది.

బుక్‌మై షోలో 24 గంటల్లోనే 50.71 వేల టికెట్లు బుక్ అయ్యాయి.

హిట్ టాక్ రావడంతో రెండో రోజు కూడా భారీగానే బుకింగ్స్ జరిగాయి. సినిమాకు వచ్చిన టాక్‌ని బట్టి చూస్తే..వీకెండ్‌లో కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశం ఉందని సినీ పండితులు అంచనా వేస్తున్నారు. కాగా, ఈ సినిమాకు వచ్చిన లాభాల్లో కొంతభాగం భారత సైనికులకు విరాళంగా ఇస్తామని నిర్మాత అల్లు అరవింద్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇక సినిమా విషయానికొస్తే.. ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీలో శ్రీవిష్ణుకి జోడీగా కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించగా, వెన్నెల కిశోర్ కీలక పాత్ర పోషించారు. అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్‌స్‌తో కలిసి విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు.



# సూపర్‌హిట్ చిత్రానికి సీక్వెల్.. ఆమె ఉంటే యాక్ట్ చేయనన్న హీరో

**హర్షవర్ధన్ రాణే, మావ్రా హొకేన్ జంటగా నటించిన చిత్రం ‘సనమ్ తేరీ కసమ్’. ఈ సినిమా సీక్వెల్‌పై తాజాగా హర్షవర్ధన్ రాణే కీలక వ్యాఖ్యలు చేశారు.**

ముంబయి: బాలీవుడ్ నటుడు హర్షవర్ధన్ రాణే , పాకిస్థానీ నటి మావ్రా హొకేన్ జంటగా నటించిన చిత్రం ‘సనమ్ తేరీ కసమ్’ . చిత్రానికి సీక్వెల్ రూపొందించనున్నట్లు ఇప్పటికే టీమ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి మావ్రా హొకేన్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేయడంపై హర్షవర్ధన్ రాణే అసహనం వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలను తప్పుపట్టారు. పార్ట్ 1లో యాక్ట్ చేసిన వారు సీక్వెల్‌లో ఉంటే తాను సినిమా చేసేందుకు సిద్ధంగా లేనని వెల్లడించారు.

“పరిస్థితులను నేను గౌరవిస్తున్నా. నా దేశాన్ని ఉద్దేశించి కొంతమంది కీలక వ్యాఖ్యలు చేసిన తరుణంలో నేనొక నిర్ణయానికి వచ్చా. గతంలో నటించిన వారే ఇప్పుడు ‘సనమ్ తేరీ కసమ్ 2’లోనూ యాక్ట్ చేస్తే.. అందులో నేను యాక్ట్ చేయాలనుకోవడం లేదు” అని ఆయన రాసుకొచ్చారు. మరో పోస్ట్‌లో మావ్రా చేసిన పోస్ట్‌ను ఆయన షేర్ చేశారు. “ఏ దేశానికి చెందిన నటీనటులనైనా నేను గౌరవిస్తాను. కానీ, నా దేశాన్ని ఉద్దేశించి ఎవరైనా చులకనగా మాట్లాడితే ఏమాత్రం సహించను. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్ తగ్గినా ఫర్వాలేదు కానీ.. దేశ గౌరవాన్ని తగ్గించాలని ప్రయత్నిస్తే ఊరుకోను. నీ దేశానికి మద్దతుగా నిలబడటం మంచిదే. అలా అని పక్క దేశంపై విషపూరిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సరికాదు” అని హితవు పలికారు. రూ.14 కోట్ల బడ్జెట్‌తో రాధికా రావు తెరకెక్కించిన ‘సనమ్ తేరీ కసమ్’ 2016లో విడుదలై విశేషంగా ప్రేక్షకులను అలరించింది. ఇటీవల ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేయగా.. రూ.41 కోట్లు వసూలు చేసి రికార్డు క్రియేట్ చేసింది.



# లండన్ టు కోల్‌కతా బస్సు.. ఇదొక ఐకానిక్ సర్వీస్: పూరి జగన్నాథ్

**‘పూరి మ్యూజింగ్స్’ వేదికగా మరో ఆసక్తికర విషయం గురించి మాట్లాడారు ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ . ‘లండన్ టు కోల్‌కతా’ పేరుతో చాలా ఏళ్ల క్రితం నడిచిన బస్సు సర్వీస్ గురించి ఆయన తెలియజేశారు.**

‘పూరి మ్యూజింగ్స్’ వేదికగా ఆసక్తికర విషయాలు పంచుకుంటుంటారు ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ . తాజాగా ఆయన ‘లండన్ టు కోల్‌కతా’ పేరుతో చాలా ఏళ్ల క్రితం నడిచిన బస్సు సర్వీస్ గురించి ఆయన తెలియజేశారు. సుమారు 50 రోజులపాటు సాగే ఈ ప్రయాణం ఎంతో సరదాగా ఉండేదని చెప్పారు. ఈ ప్రయాణంలో ఎన్నో కథలు ఉండేవని తెలిపారు.

“ది లెజండరీ లండన్ టు కోల్‌కతా బస్సు జర్నీ గురించి ఎప్పుడైనా విన్నారా? ఇది 1957లో ప్రారంభమైంది. లండన్ నుంచి కోల్‌కతాకు బస్సు సర్వీస్. ప్రపంచంలోనే అతి పొడవైన బస్సు మార్గంగా చెప్పేవారు. ఈ సర్వీస్‌ను ఆల్బర్ట్ ట్రావెల్స్ అనే సంస్థ మొదలుపెట్టింది. దాదాపు 20 వేల మైళ్ల ప్రయాణం. 32,700 కిలోమీటర్లు. లండన్ నుంచి కోల్‌కతా చేరుకోవడానికి అప్పట్లో సుమారు 50 రోజులు పట్టేది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియం, ఆసియా, తుర్కియే, ఇరాన్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, ఇండియా ఈ రూట్‌ను హిప్పీ రూట్ అని పిలిచేవారు. 1957లో టికెట్ ధర 85 డాలర్లు (ఒకసారి ప్రయాణించడానికే). ఈ బస్సు తన మొదటి ప్రయాణాన్ని ఏప్రిల్ 15, 1957లో లండన్‌లో ప్రారంభించి జూన్ 5కు కోల్‌కతా చేరుకుంది. ఈ బస్సు ఒక మూవింగ్ హోటల్‌లా ఉండేది. నిద్రపోవడానికి అవసరమైన సదుపాయం, చిన్న కిచెన్, లైబ్రరీ ఇలాంటి వసతులన్నీ బస్సులోనే ఉండేవి. ఫుడ్ కూడా బస్సు వాళ్లే పెట్టేవారు. రెండు నెలల ప్రయాణమంటే ఒక అందమైన టూర్‌లా ఉండేది. బెనారస్, తాజ్‌మహల్ ఇలాంటి ప్రదేశాలు సందర్శించుకుంటూ వెళ్లొచ్చు. హిప్పీస్, భగ్న ప్రేమికులు ఎక్కువగా ఈ ప్రయాణం చేసేవారు. బోర్డర్ చెక్ పాయింట్స్ వద్ద ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. కాకపోతే ఇరాన్, కాబుల్‌లో కాస్త స్వల్ప సమస్యలు ఏర్పడేవి. వయసులో ఉన్నవారే ఎక్కువగా ఈ ప్రయాణంలో భాగమయ్యేవారు. అందువల్ల ప్రయాణం ఎంతో సరదాగా సాగేది. ఇష్టమైన ఫుడ్ తింటూ నచ్చినట్టు జీవిస్తూ రెండు నెలలపాటు ఈ ప్రయాణాన్ని ఎంజాయ్ చేసేవారు. కొంతమంది మధ్యలో ఏదో ఒక దేశంలో ఈ బస్సు ఎక్కేవారు. ఇంకొంతమంది మధ్యలోనే దిగి వెళ్లిపోయేవారు. ఒక బ్రిటిష్ వ్యక్తి ఆరు దేశాల్లో ఆరుగురు అమ్మాయిలతో ప్రేమలో పడి చివరకు ఏడ్చుకుంటూ కోల్‌కతా చేరాడట. ఒక కోతి ఎవరిదో పాస్‌పోర్ట్ ఎత్తుకుపోయిందట. ఇలాంటి కథలు ఈ బస్సు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. ఇందులో ప్రయాణించిన పీటర్ మోస్ అనే వ్యక్తి.. ‘ది ఇండియా మ్యాన్’ అనే పుస్తకం రాశాడు. అప్పట్లో లండన్‌లో ఇది ఐకానిక్ బస్సు. ఈ బస్సు సర్వీస్ 1979 వరకు ఉంది. ఆ తర్వాత ఇరాన్ విప్లవం, అఫ్ఘానిస్థాన్‌సోవియట్‌కు మధ్య యుద్ధాలు రావడం వల్ల ఈ సర్వీస్ నిలిచిపోయింది. ఇప్పటికీ ఇలాంటి బస్సు సర్వీస్ ఉంటే ఎంతో బాగుండేది. భవిష్యత్తులో ఎవరైనా ఇలాంటి సర్వీస్ మొదలు పెడతారేమో చూద్దాం” అని పూరి జగన్నాథ్ తెలిపారు.

### రోహిత్ బాటలోనే విరాట్ కోహ్లీ..
# టెస్టులకు వీడ్కోలు?

**భారత స్టార్ ద్వయం ఇక టెస్టుల్లో కనిపించదా? ఇప్పటికే ఒకరు వీడ్కోలు పలకగా.. మరొకరు అందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి.**

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కూడా టెస్టులకు రిటైర్‌మెంట్ తీసుకుంటాడా? అవుననే అంటున్నాయి క్రికెట్ వర్గాలు. ఇటీవల కెప్టెన్ రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. అతడి బాటలోనే కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలకాలని భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయాన్ని బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లినట్లు వార్తలు వస్తున్నాయి. జూన్ నుంచి ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్‌ఇండియా వెళ్లనుంది. ఆలోగానే టెస్టు భవితవ్యంపై కోహ్లీ ప్రకటన చేస్తాడని సమాచారం. తన రిటైర్‌మెంట్ ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని బీసీసీఐకి కోహ్లీ చెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కోహ్లీ ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. ఇప్పటికే రోహిత్, రవీంద్ర జడేజాతో కలిసి టీ20లకు గుడ్‌బై చెప్పేసిన సంగతి తెలిసిందే.





## ఐపీఎల్ పునఃప్రారంభంపై బీసీసీఐ కీలక సమావేశం

భారత్, పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మే 8న ధర్మశాలలో జరగాల్సిన మ్యాచ్‌ను అర్ధంతరంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే.

భారత్, పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మే 8న ధర్మశాలలో జరగాల్సిన మ్యాచ్‌ను అర్ధంతరంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. తర్వాత ఐపీఎల్‌ను వారం రోజులు వాయిదా వేసింది. తాజాగా కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్ అంగీకరించడంతో ఐపీఎల్ పునఃప్రారంభానికి మార్గం సుగమమైంది.

'శనివారం సాయంత్రం 5 గంటల నుంచి భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణ పాటించనున్నాయి' అని మధ్యవర్తిత్వం వహించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరు దేశాలూ ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. దీంతో ఐపీఎల్ పునఃప్రారంభంపై క్రికెట్ అభిమానుల్లో ఆశలు చిగురించాయి. సరిహద్దులకు దూరంగా దక్షిణ భారతదేశంలోని బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వేదికగా మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం ఉందని కాల్పుల విరమణ ప్రకటనకు ముందే వార్తలు వచ్చాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ఐపీఎల్‌లో ఇంకా మిగిలి ఉన్న 16 మ్యాచ్‌ల నిర్వహణ విషయమై మే 11న బీసీసీఐ కీలక సమావేశం నిర్వహించనుంది. వీలైనంత త్వరగా ఐపీఎల్ మ్యాచ్‌ల పునఃప్రారంభంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.




## ఇండియాలోనే టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్..? ఆందోళనలో ఐసీసీ



టెస్ట్ ఛాంపియన్ షిప్ ప్రారంభమైన దగ్గర నుంచి ఫైనల్ మ్యాచ్ ఇంగ్లాండ్ లోనే జరుగుతుంది. రెండు సార్లు ఇంగ్లాండ్ లోనే టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ నిర్వహించగా.. వచ్చే నెలలో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్ల మధ్య జరగబోయే డబ్ల్యూటీసీ ఫైనల్ కు లార్డ్స్ వేదిక కానుంది. దీంతో వరుసగా మూడోసారి ఈ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ ఇంగ్లాండ్ లోనే జరగబోతుంది. జూన్ 11 నుంచి 15 మధ్య ఐకానిక్ లార్‌డ్స్‌లో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ జరుగుతుందని ఐసీసీ 2024 సెప్టెంబర్ 3న ప్రకటించింది. జూన్ 16ని రిజర్వ్ డేగా కేటాయించారు. అయితే ఈ సారి టెస్ట్ ఛాంపియన్స్ షిప్ ఫైనల్ వేదిక మారే అవకాశం ఉంది.

బీసీసీఐ 2027లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌ను ఇండియాలో నిర్వహించాలనే ఆలోచనలో ఉంది. 2027 టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌ను భారత్ వేదిక కావాలనే కోరికను బీసీసీఐ వ్యక్తం చేసింది. గత నెలలో జింబాబ్వేలో జరిగిన ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ సమావేశంలో 2027 డబ్ల్యూటీసీ ఫైనల్‌ను నిర్వహించాలనే ఉద్దేశ్యాన్ని ఐసీసీకి బీసీసీఐ సమర్పించింది. అయితే ఇక మాత్రమే ఈ ప్రపోజల్ పట్ల ఆసక్తిగా లేనట్టు తెలుస్తోంది. భారత జట్టు 2027లో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోతే ఇండియాలో టిక్కెట్ల అమ్మకాలు భారీగా దెబ్బతింటాయి.

**ఇప్పటివరకు జరిగిన రెండు**

డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ లు సౌతాంప్టన్ (2021), ఓవల్ (2023) వేదికలుగా జరిగాయి. 2021 లో జరిగిన ఫైనల్లో భారత్ పై న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 2023 ఓవల్ వేదికగా జరిగిన మ్యాచ్ లో ఆస్ట్రేలియా 229 పరుగుల భారీ తేడాతో భారత్ ను ఓడించింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ 202325 లో భాగాంగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లు అధికారికంగా డబ్ల్యూటీసీ ఫైనల్ కు చేరుకున్నాయి. జూన్ 11 నుంచి 15 మధ్య ఐకానిక్ లార్‌డ్స్‌లో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ జరుగుతుందని ఐసీసీ 2024 సెప్టెంబర్ 3 న ప్రకటించింది. జూన్ 16ని రిజర్వ్ డేగా కేటాయించారు. వరుసగా మూడోసారి ఈ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ ఇంగ్లాండ్ లోనే జరగబోతుంది. ఆస్ట్రేలియా వరుసగా రెండో సారి టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కు అర్హత సాధించగా.. సౌతాఫ్రికాపై ఇదే తొలిసారి.



### పాక్‌కు అంత సీన్ లేదు.. త్వరలోనే మ్యాచులు చూస్తాం: గంగూలీ

**ఐపీఎల్ సీజన్‌ను అర్ధంతరంగా వారం రోజులపాటు వాయిదా పడింది. ఆటగాళ్ల భద్రతే ముఖ్యమని బీసీసీఐ భావించింది.**

భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్ 2025 సీజన్‌ను బీసీసీఐ వారం రోజులపాటు వాయిదా వేసింది. దాయాదుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతో క్రికెట్ ఆడటం సమంజసం కాదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, త్వరలోనే మళ్లీ ఐపీఎల్ మ్యాచ్‌లు చూస్తామని.. పాకిస్థాన్ మరింతకాలం ఒత్తిడి తట్టుకోవడం కష్టమని భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ వ్యాఖ్యానించాడు.

''ప్రస్తుతం దేశంలో యుద్ధ వాతావరణం ఉంది. దీంతో బీసీసీఐ ఐపీఎల్‌ను వాయిదా వేసింది. ఎందుకంటే భారత్‌కు చెందిన క్రికెటర్లే కాకుండా విదేశీ ప్లేయర్లు చాలామంది ఉన్నారు. వారి భద్రత విషయంలో రాజీ పడకూడదు. అయితే, త్వరలోనే ఐపీఎల్ 2025 సీజన్ పునఃప్రారంభమవుతుంది. ఇప్పుడు టోర్నీ కీలక దశలో ఉంది. ధర్మశాల, చండీగఢ్, దిల్లీ, జైపుర్.. ఇలాంటి మైదానాల్లో కొన్ని మ్యాచులు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీసీఐ నిర్ణయం సరైందే. గత మ్యాచ్ సమయంలో ఏం జరిగిందో చూశాం. త్వరలోనే పరిస్థితులు చక్కబడతాయి. బీసీసీఐ తప్పకుండా ఐపీఎల్‌ను పూర్తి చేస్తుంది. ఎందుకంటే ఒత్తిడిని మరింత కాలం తట్టుకొనేంత సీన్ పాక్‌కు లేదు'' అని గంగూలీ తెలిపాడు.

పూర్తి అవగాహనతో ఉన్నాం: హిమాచల్ క్రికెట్ అసోసియేషన్

''భారత్ పాక్ మధ్య టెన్షన్ వాతావరణం ఉంది. పంజాబ్, దిల్లీ మ్యాచ్‌ను మధ్యలోనే రద్దు చేశాం. భద్రతా కారణాలతోనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ మధ్య సమన్వయం ఉంది. బీసీసీఐ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూనే ఉన్నాం'' అని హెచ్‌పీసీఏ సభ్యుడు సంజయ్ శర్మ వెల్లడించారు.

# వందే భారత్‌లో దిల్లీకి క్రికెటర్లు

**ధర్మశాలలో గురువారం పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ ఆగిపోయిన నేపథ్యంలో తర్వాతి రోజు ఈ రెండు జట్ల ఆటగాళ్లు, సిబ్బందిని వందే భారత్ ప్రత్యేక రైలులో దిల్లీకి తీసుకెళ్లారు.**
**ధర్మశాల నుంచి జలంధర్ మీదుగా పంజాబ్, డీసీ జట్ల ప్రయాణం**
**దిల్లీ రైల్వేస్టేషన్‌లో మోహిత్, కుల్‌దీప్**

**ధర్మశాల:** ధర్మశాలలో గురువారం పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ ఆగిపోయిన నేపథ్యంలో తర్వాతి రోజు ఈ రెండు జట్ల ఆటగాళ్లు, సిబ్బందిని వందే భారత్ ప్రత్యేక రైలులో దిల్లీకి తీసుకెళ్లారు. భారత్, పాక్ మధ్య దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో ధర్మశాల సహా పలు విమానాశ్రయాలను మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో పంజాబ్, దిల్లీ ఆటగాళ్లను రైల్లో దిల్లీకి తీసుకెళ్లాల్సి వచ్చింది. మ్యాచ్ ఆగిపోయాక కాసేపటికే భారీ భద్రత మధ్య ఆటగాళ్లను వారు బస చేస్తున్న హోటళ్లకు తీసుకెళ్లిన పోలీసులు.. తర్వాతి రోజు ఉదయం దిల్లీ ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో ముందు జాగ్రత్తగా ఎక్కువ మందితో బస్సుల్లో ప్రయాణించడాన్ని కూడా నివారించారు. దాదాపు 50 వాహనాలను వినియోగించి చిన్న చిన్న బృందాలుగా రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆటగాళ్లకు భద్రతగా పెద్ద సంఖ్యలో పోలీసు వాహనాలు కూడా వెంట వెళ్లినట్లు కంగ్రా జిల్లా ఎస్పీ వెల్లడించారు. అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో జలంధర్ మీదుగా పంజాబ్, డీసీ ఆటగాళ్లు, సిబ్బంది దిల్లీకి చేరుకున్నారు.

**తొక్కిసలాట జరగకుండా.. పకడ్బందీగా:**

గురువారం రాత్రి ధర్మశాలలో గురువారం రాత్రి దిల్లీ, పంజాబ్ మధ్య మ్యాచ్ అర్ధంతరంగా ఆగిపోవడానికి కారణం ఫ్లడ్ లైట్ల వైఫల్యమే అని ముందు అనుకున్నారంతా. కానీ జమ్ము సహా పలు నగరాలపై పాకిస్థాన్ సైన్యం డ్రోన్ దాడులకు పాల్పడిన నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లోని అనేక నగరాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఈ క్రమంలోనే ధర్మశాలలోనూ ఫ్లడ్ లైట్లు ఆగిపోయాయి. పరిస్థితి తీవ్రత దృష్ట్యా మ్యాచ్‌ను కొనసాగించడం మంచిది కాదని ఐపీఎల్ అధికారులకు ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం వచ్చింది. అయితే భద్రత కారణాలతో మ్యాచ్ ఆపేస్తున్నట్లు చెబితే ప్రేక్షకులు ఆందోళనకు గురై, తొక్కిసలాట జరిగే ప్రమాదం ఉందని ఐపీఎల్ అధికారులు, పోలీసులు భావించారు. ఆ సమయంలో స్టేడియంలోనే ఉన్న ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధూమల్.. పోలీసులతో సమన్వయం చేసుకుని గందరగోళానికి తావివ్వకుండా ప్రేక్షకులను బయటికి పంపే ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్ లైట్ల వైఫల్యం వల్లే మ్యాచ్ ఆగిందని, అవి మళ్లీ వెలగవని చెప్పి అభిమానులతో స్టేడియం ఖాళీ చేయించారు. ''ముందు ఫ్లడ్‌లైట్ల వైఫల్యం గురించి చెబితే ప్రేక్షకులు స్టేడియాన్ని వీడలేదు. అయినా వారిని ఒత్తిడికి గురి చేయకుండా, తొక్కిసలాటకు ఆస్కారం ఇవ్వకుండా అందరినీ బయటికి పంపాం. హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం అధికారులు, పోలీసుల వల్లే అరగంటలోనే 25 వేల మంది ప్రేక్షకులను ఖాళీ చేయించగలిగాం'' అని ధూమల్ తెలిపాడు.

**పీఎస్‌ఎల్ కూడా..**

**లాహోర్:** భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్)ను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వాయిదా వేసింది. టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించనున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే పీసీబీ ఈ వాయిదా నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్ సలహా మేరకు టోర్నమెంట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. కానీ అసలు కారణం.. పీఎస్‌ఎల్ మిగతా మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వడానికి యూఏఈ సిద్ధంగా లేకపోవడమే అని సమాచారం. మ్యాచ్‌ల నిర్వహణకు పీసీబీ ప్రతిపాదిస్తే యూఏఈ తిరస్కరించే అవకాశముంది. ''గత కొన్నేళ్లుగా బీసీసీఐతో ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు బలమైన సంబంధాల్ని కొనసాగిస్తోంది. 2021లో భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సిన ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను, అదే ఏడాది ఐపీఎల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్‌ఇండియా మ్యాచ్‌లను నిర్వహించింది'' అని యూఏఈ బోర్డు వర్గాలు తెలిపాయి. ఐసీసీ ప్రధాన కార్యాలయం కూడా దుబాయ్‌లోనే ఉంది. ప్రస్తుతం ఐసీసీకి జై షా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు.

